క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన



మాడ్చెట్‌పల్లిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సిబ్బంది అనంతరాజశర్మ, సునీతారెడ్డి తదితరులు పరిశీలించారు. మంగళవారం పెద్దశంకరంపేటతో పాటు కోళాపల్లి, బూర్గుపల్లి, మక్తలక్ష్మాపూర్, మాడ్చెట్‌పల్లి తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల వసతులను వారు సందర్శించారు. ప్రజలు తప్పకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని వారు సూచించారు.

ఎన్నికల నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

అల్లాదుర్గం(మెదక్): ఎన్నికల నిబంధనలు ఎవరు అతిక్రమించిన కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ ప్రవీణ్‌రెడ్డి మంగళవారం చెప్పారు. ఎన్నికల ప్రచారం ముగిసినందున నేటి సాయంత్రం 5 నుంచి 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఐదు మంది కంటే ఎక్కువ మంది గుమ్మిగూడి తిరగడం, జెండాలు పట్టుకొని ప్రచారం చేస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఎన్నికల రోజు ఓటర్లను ఓటింగ్ కేంద్రానికి వాహనాల్లో తరలించవద్దన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు రాజకీయ నాయకులు, నేతలు సహకరించాలని కోరారు.

ముగిసిన ప్రచారం



మదూర్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

చిన్నశంకరంపేట(మెదక్): హోరాహోరిగా జరిగిన ఎన్నికల ప్రచారం మంగళవారం సాయంత్రం ముగిసింది. మండల కేంద్రంతో పాటు మదూర్, చందంపేట, గవ్వలపల్లి, శాలిపేట గ్రామాల్లో సాయంత్రం వరకు బీఆర్‌ఎస్ నాయకులు పద్మాదేవేందర్‌రెడ్డికి అనుకూలంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ అభ్యర్థి శేరిపల్లి, మిర్జాపల్లి, సంగాయిపల్లి గ్రామాల్లో చివరి రోజు ఎన్నికల ప్రచారం నిర్వహించగా, కాంగ్రెస్ నాయకులు మెదక్‌లో నిర్వహించే ర్యాలీకి తరలివెళ్లారు. మండలంలో 40 పోలింగ్ బూత్‌ల్లో 32 వేల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం నుంచి 144 సెక్షన్ అమలులోకి రావడంతో అధికారులు గ్రామాలలో పోలీస్ నిఘాను పెంచినట్లు ఎస్‌ఐ నారాయణ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



భాషయ్య(ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల పరిధిలోని నవాబుపేట గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ రవికాంత్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బర్మాల భాషయ్య(55) కూలీ పనులు చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. కూతుర్ల పెళ్లిళ్లకు చేసిన అప్పులతో పాటు మూడో కూతురి పెళ్లికి డబ్బులు అవసరం అయ్యాయి. దీంతో ఆర్థిక ఇబ్బందులతో సోమవారం రాత్రి ఇంట్లో నుంచి వెళ్లి గ్రామ శివారులోని చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు.

ఘనంగా జ్యోతిబాపూలే వర్ధంతి



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నిజాంపేట(మెదక్): మండలం కేంద్రంలో మంగళవారం ఉపసర్పంచ్ కొమ్మటబాబు ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబాపూలే వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సిద్ధరాంరెడ్డి, సంగు స్వామి, స్వామి గౌడ్, బండారి ఎల్లం, తంబల రమేశ్, నాయిని లక్ష్మణ్, కొమ్మాట రామస్వామి, నారా గౌడ్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ స్ఫూర్తికి వ్యతిరేకంగా బీఆర్‌ఎస్

నర్సాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి



మాసాయిపేటలో ఇంటింటి ప్రచారం చేస్తున్న రాజిరెడ్డి

వెల్దుర్తి(తూప్రాన్): అమరుల త్యాగాల పునాదులపై ఏర్పడిన తెలంగాణలో ఉద్యమ స్ఫూర్తికి విరుద్ధంగా రాష్ట్రంలో దొరల పాలన సాగుతుందని నర్సాపూర్ కాంగ్రెస్ అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఉమ్మడి వెల్దుర్తి మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి హస్తం గుర్తుకు ఓటువేసి తనను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు రాజిరెడ్డికి మంగళ హారతులతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ హయాంలో పేదలు, నిరుద్యోగుల సమస్యలు తీరలేదని, రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు పెరిగాయని అన్నారు. సీఎం కేసీఆర్ ప్రాజెక్టుల పేరుతో కమీషన్లు దండుకున్నారు తప్ప ప్రజలకు చేసిందేమీలేదన్నారు. ప్రచారంలో వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, మండలాధ్యక్షుడు మహేశ్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీటీసీ కృష్ణారెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, కిష్టాగౌడ్, నాగరాజు, ఉమేశ్‌రెడ్డి, దుర్గాగౌడ్, మైసయ్య పాల్గొన్నారు.

శివ్వంపేట(నర్సాపూర్): ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం ఖాయమైపోయిందని నర్సాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆవుల రాజిరెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రం శివ్వంపేట ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన వీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రచార పర్వంలో జనాన్ని చూస్తే విజయోత్సవ ర్యాలీగా ఉందని అన్నారు.

అన్ని రంగాల ప్రజలను మోసం చేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రజలు గుణపాఠం చేప్పేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 6 గ్యారంటీలను ముందుగా అమలు చేస్తామన్నారు. ఓటర్లందరు చేతి గుర్తుకు ఓటేని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, కాంగ్రెస్ నాయకులు సుహాసినిరెడ్డి, కర్ణాకర్‌రెడ్డి, సుదర్శన్‌గౌడ్, నవీన్‌గుప్తా, కమలపూల్‌సింగ్, సుధీర్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, రమేశ్‌గౌడ్, వెంకటేశ్, గణేశ్, రవిగౌడ్, గణేశ్‌గౌడ్, మోహన్, అశోక్ ఉన్నారు.



శివ్వంపేట(నర్సాపూర్): మాట్లాడుతున్న రాజిరెడ్డి

ఆర్‌ఎంపీ, పీఎంపీల మద్దతు బీఆర్‌ఎస్‌కే



మాట్లాడుతున్న రాములు

నర్సాపూర్ రూరల్: బీఆర్‌ఎస్‌కు తమ మద్దతు తెలుపుతున్నట్లు ఆర్‌ఎంపీ, పీఎంపీల వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు అన్నారు. మంగళవారం నర్సాపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతారెడ్డికి మద్దతుగా వారు సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందిస్తున్న ఆర్‌ఎంపీలు పీఎంపీలను తెలంగాణ ప్రభుత్వం గుర్తించి ప్రోత్సహించింది అన్నారు. అందుకు ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు మద్దతుగా ఉండి కారు గుర్తుకు ఓటు వేసి సునీతారెడ్డిని గెలిపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంపీ, పీఎంపీల వెల్ఫేర్ సంఘం నాయకులు శ్రీనివాస్ నాయక్, శంకర్ నాయక్, దుర్గేశ్, మహేశ్ గౌడ్, కృష్ణ, వెంకటేశ్, వీరేశ్, సుధాకర్, రమేశ్, హుస్సేన్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

హోరెత్తిన ప్రచారం



కిష్టాపూర్‌లో కాంగ్రెస్ ప్రచారం

కొల్చారం(నర్సాపూర్): మండల వ్యాప్తంగా ఎన్నికల ప్రచారం చివరి రోజు మంగళవారం హోరెత్తింది. ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున గ్రామాల్లో పోటీ పడి ర్యాలీలను నిర్వహించడంతో పాటు ఇంటింటి ప్రచారాన్ని చేశారు. తమ పార్టీలకు చెందిన అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు నానా తంటాలు పడ్డారు. మరోవైపు నర్సాపూర్‌లో బీఆర్‌ఎస్ పార్టీ నిర్వహించిన గౌడ సంఘం ఆత్మీయ సమ్మేళనానికి మండలం నుంచి ఆ వర్గానికి చెందిన వారు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు.

హ్యాట్రిక్ సీఎం కావాలని...

– నాచగిరిలో 'ముడుపు' కట్టిన నేత

వర్గల్(గజ్వేల్): కేసీఆర్ గజ్వేల్ నుంచి విజయం సాధించి మూడోసారి సీఎంగా బాధ్యతలు స్వీకరించాలని కోరుకుంటూ మంగళవారం తెలంగాణ పద్మశాలి సంఘం కన్వీనర్ బూర మల్లేశం నాచగిరి శ్రీలక్ష్మీ నృసింహ క్షేత్రంలో ముడుపు కట్టారు. ఆపై ప్రత్యేక పూజలు జరిపించారు.

అభివృద్ధిని చూసి ఓటు వేయండి



ప్రచారం చేస్తున్న వైస్ ఎంపీపీ సుజాత

చిన్నశంకరంపేట(మెదక్): గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని నార్సింగి వైస్ ఎంపీపీ సుజాత కోరారు. చిన్నశంకరంపేట ఉమ్మడి మండలంలోని జప్తిశివనూర్ గ్రామంలో బీఆర్‌ఎస్ మెదక్ ఎమ్మెల్యే అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డిని గెలిపించాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నూతన జిల్లా కేంద్రంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉండేలా నూతన మండలాలను ఏర్పాటు చేసి, ప్రజలకు అందుబాటులో మండల కార్యాలయాలను ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ షేక్ షరీఫ్, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు యాదగిరి, నాయకులు బాలమల్లయ్య తదితరులు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు



కొడిపల్లిలో బీర్‌ఎస్‌లో చేరుతున్న కాంగ్రెస్, బీజేపీ నాయకులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని రాజిపేట గ్రామానికి చెందిన బీజేపీ మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు ప్రసన్న, వార్డు సభ్యులు బాంచ శ్రీనివాస్, మన్నె ప్రవీణ్‌కుమార్, గాండ్ల జ్యోతి, కాంగ్రెస్ నాయకులు మన్నె నాగరాజు, పోచగౌడ్, జహంగీర్, రిటైర్డ్ డాక్టర్ పద్మారావు తదితరులు ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా సునీతారెడ్డి గెలుపుకోసం కృషి చేయాలనాు. కార్యక్రమంలో సర్పంచ్ లింగం గౌడ్, ఉపసర్పంచ్ మాధవిశివ, మాజీ సర్పంచ్ పాషా, సొసైటీ డైరెక్టర్ మల్లేశం తదితరులు పాల్గొన్నారు. మండలంలోని జాజితండాలో సర్పంచ్ రమేశ్, ఎంపీటీసీ ప్రవీణ్‌కుమార్, పాండు, కుషన్‌గడ్డ తండాలో సర్పంచ్‌లు ఎల్లం, లావణ్య, మోహన్, కిషోర్‌గౌడ్, అమర్‌సింగ్ ఉన్నారు.



జాజితండాలో బీఆర్‌ఎస్ నాయకుల ఇంటింటి ప్రచారం

ఆడబిడ్డగా ఆదరించి గెలిపించండి

మెదక్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న పద్మాదేవేందర్‌రెడ్డి

మెదక్: ఆడబిడ్డగా ఆదరించి గెలిపించాలని మెదక్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి ప్రజలను కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం పట్టణంలో బీఆర్‌ఎస్ నాయకులు రాందాస్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ కోసం ఎమ్మెల్యే పదవి రాజీనామా చేయమంటే ఒక క్షణం ఆలోచించకుండా రాజీనామా చేసినట్లు చెప్పారు. తెచ్చుకున్న తెలంగాణ తెర్లు కావొద్దని సీఎం అనేక సంక్షేమ కార్యక్రమాలు ఏర్పాటు చేశారన్నారు. గతంలో కాంగ్రెస్ ఏడు గంటల కరెంట్ ఇచ్చి రైతులను నానా అవస్థలు పెట్టిందన్నారు. పెట్టుబడి లేక రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, ప్రత్యేక రాష్ట్రం తర్వాత కరెంట్, సాగు నుంచి కష్టాలు లేవన్నారు. 11 సార్లు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ 55 ఏళ్లు రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్ 24 గంటల కరెంట్ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి మూడు గంటల కరెంట్ ఇస్తే సరిపోతుందని అంటున్నారన్నారు. గడిచిన పదేళ్లలో మెదక్‌ను ప్రత్యేక జిల్లా ఏర్పాటు, మెడికల్ కాలేజీ మంజూరి, పట్టణాభివృద్ధికి రూ. 50 కోట్లు ఇటీవలే మంజూరు చేశామన్నారు. మైనంపల్లి హనుమంతరావు రెండు సార్లు మెదక్ ఎమ్మెల్యేగా గెలిచి ఏం అభివృద్ధి చేశారో చెప్పాలన్నారు. మొన్నటి వరకు కేసీఆర్ గొప్పవాడు అంటూ కాళ్లు మొక్కిన హన్మంతరావు కొడుకుకి టికెట్ ఇవ్వకపోతే పార్టీ మారినట్లు చెప్పారు. రోహిత్‌కు ఈ ప్రాంతంలో బర్రె, గొర్రె, చేను, చెలకా తెలుసా అని ప్రశ్నించారు. ఈసారి గెలిపిస్తే మెదక్‌కు రింగ్ రోడ్డుతో పాటు పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేస్తానని చెప్పారు. నాకు జన బలం ఉందని, మైనంపల్లికి ధన బలం ఉందిని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ వద్ద డబ్బులు పంచితే తీసుకొని కారుగుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు దేవేందర్‌రెడ్డి, తిరుపతి రెడ్డి, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, వైస్ చైర్మన్ మల్లికార్జున గౌడ్, మెదక్ మార్కెట్ కమిటీ చైర్మన్ బట్టి జగపతి, రాగి అశోక్, వనజ ఉన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే తండాల్లో అభివృద్ధి



గిరిజనులతో మాట్లాడుతున్న పద్మాదేవేందర్‌రెడ్డి

చిన్నశంకరంపేట(మెదక్): గిరిజన తండాలను ప్రత్యేక పంచాయతీలుగా మార్చిన బీఆర్‌ఎస్‌ను ఆదరించాలని మెదక్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మాదేవేందర్‌రెడ్డి కోరారు. మంగళవారం చిన్నశంకరంపేట మండలంలోని జంగరాయి తండా, ఎర్రగుంటతండా, నాగులమ్మతండా, సర్వన్ తండాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గిరిజనులకు తెలంగాణ రాష్ట్రంలోనే గౌరవం దక్కిందన్నారు. ప్రత్యేక పంచాయతీలతో పాటు సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహిస్తూ.. సీఎం కేసీఆర్ గిరిజనులకు గౌరవం కల్పించారన్నారు. ప్రత్యేక పంచాయతీలతో అభివృద్ధి బాటపట్టిన గిరిజన తండాల ప్రజలు కారు గుర్తుకు ఓటు వేసి, బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రమేశ్ నాయక్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పట్లోరి రాజు, భాగారెడ్డి, రవిందర్‌రెడ్డి, సంజీవరెడ్డి, ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

నారాయణఖేడ్ బీఆర్‌ఎస్ అభ్యర్థి భూపాల్‌రెడ్డి



పెద్దశంకరంపేటలో ప్రచారంలో భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): నారాయణఖేడ్ నియోజకవర్గ అభివృద్ధిని చూసి మరోసారి తనను ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి భూపాల్‌రెడ్డి ప్రజలను కోరారు. మంగళవారం పెద్దశంకరంపేటలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు ఇంటింటికి చేరాయని, మరోసారి బీఆర్‌ఎస్ పార్టీని భారీ మెజార్టీతో గెలిపిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు. కారు గుర్తుకే ఓటేయాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో కేంద్ర ఎఫ్‌సీఐ మాజీ డైరెక్టర్ విగ్రాం శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ జంగం శ్రీనివాస్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు మురళి, వైస్ ఎంపీపీ లక్ష్మీరమేశ్, సీనియర్ నాయకులు వేణుగోపాల్‌గౌడ్, ఎంపీటీసీ వీణసుభాష్‌గౌడ్, పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు రాఘవులు, పున్నయ్య, మైనార్టీ సెల్ అధ్యక్షుడు సలీం తదితరులున్నారు.

బీజేపీతోనే సంక్షేమ పథకాలు

మెదక్ బీజేపీ అభ్యర్థి విజయ్ కుమార్



బచ్చురాజ్‌పల్లిలో ప్రచారంలో మెదక్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయ్‌కుమార్

నిజాంపేట(మెదక్): బీజేపీతోనే సంక్షేమ పథకాలు ఉంటాయని, తనను గెలిపిస్తే ప్రతీ ఇంట్లో పెద్దబిడ్డగా ఉండి మెదక్‌ను అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తానని మెదక్ బీజేపీ అభ్యర్థి పంజా విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం బచ్చురాజ్‌పల్లి గ్రామంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాంపేటకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లేక చాలా ఇబ్బంది గురవుతున్నారని, ఆరోగ్య కేంద్రం గురించి తనని ఎవరు పట్టించుకోలేదని తెలిపారు. ఈ మండలం ఏర్పడిందే విద్య, వైద్యం పూర్తి స్థాయిలో ప్రజలకు అందించడానికి అన్నారు. కానీ నిజాంపేట మండలం ఏర్పడి ఏడేళ్లు పూర్తయిన ఇప్పటివరకు మండలంలో ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జోరుగా బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం



నార్సింగిలో మాట్లాడుతున్న కత్తి కార్తీక

రామాయంపేట(మెదక్): బూటకపు హామీలతో దుబ్బాక బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు మళ్లీ ప్రజలను మోసగించడానికి యత్నిస్తున్నాడని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తీక ఆరోపించారు. దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డికి మద్దతుగా ఆమె మంగళవారం నార్సింగి మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కాంగ్రెస్‌లో రేవంత్‌రెడ్డి తనకు టికెట్ ఇవ్వకుండా మోసగించి టికెట్లు అమ్ముకున్నారని, అందుకే ఆ పార్టీకి రాజీనామా చేసి బీఆర్‌ఎస్‌లో చేరానని అన్నారు. జెడ్పీటీసీ కృష్ణారెడ్డి, మండలాధ్యక్షుడు బాబు పాల్గొన్నారు.



జగ్గంపేటలో ప్రచారం చేస్తున్న మన్సూర్

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని గ్రామాల్లో మంగళవారం చిలప్‌చెడ్ బీఆర్‌ఎస్ మండల ఇన్‌చార్జి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మన్సూర్ ఆధ్వర్యంలో జోరుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మన్సూర్ మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా చివరిరోజు ప్రచారం నిర్వహించామని, బీఆర్‌ఎస్ చేసిన, ప్రస్తుతం ప్రవేశపెట్టిన పథకాలు వివరిస్తూ ప్రచారం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు అశోక్ రెడ్డి, ఎంపీపీ వినోద దుర్గారెడ్డి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు లక్ష్మీ దుర్గారెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గెలిపిస్తే పెత్తందారులను తరిమికొడుతా

మెదక్ కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్



ర్యాలీకి తరలివచ్చిన ప్రజలు



మాట్లాడుతున్న మైనంపల్లి రోహిత్‌రావు

హవేళిఘణాపూర్(మెదక్): ఆదరించి ఈ ఎన్నికల్లో గెలిపిస్తే పెత్తందారుల చేతుల్లో నలిగిపోతున్న మెదక్‌కు అభివృద్ధి చేసి చూపుతానని మెదక్ కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రమైన మెదక్‌లో ఆయా మండలాల తరలివచ్చిన కార్యకర్తలతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం రాందాస్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... పదేళ్లుగా సిద్దిపేట హరీశ్‌రావు చేతుల్లో పెట్టి, మెదక్ ప్రజలను బానిసలుగా మార్చిన ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికి ప్రజలు ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని అన్నారు. మెదక్ ప్రజలను బానిసలుగా ఓట్ల ముందు వాడుకొని ఇక్కడ ఉన్న ఇసుక, భూములను దోచుకుంటున్నారని ఆరోపించారు. మెదక్ ప్రజలపై మరో ప్రాంతానికి చెందిన మంత్రి వచ్చి పెత్తనం చెలాయిస్తుంటే మెదక్ ప్రజలు అమాయకులు కాదని, ఇప్పటి వరకు నమ్మి మోసపోయినందుకు బాధతో ఉన్న ప్రజలను అసహనానికి గురి చేసేలా ఎమ్మెల్యే వ్యవహరించడం విడ్డూరంగా ఉందన్నారు. తనను మెదక్ ఎమ్మెల్యేగా గెలిపించిన వెంటనే మెదక్ ప్రజల కోసం తన తుదిశ్వాస వరకు పోరాడి మెదక్ ప్రాంతాన్ని అభివృదిద్ధ చేసి చూపుతానని అన్నారు. కాంగ్రెస్ నాయకులు కొండన్ సురేందర్‌గౌడ్, గంగా నరేందర్, జీవన్‌రావు, వెంకటరమణ, రాజిరెడ్డి, స్వామినాయక్ పాల్గొన్నారు.

ఓటు ద్వారా కేసీఆర్‌ను ఆశీర్వదించాలి

జాగృతి రాష్ట్ర కార్యదర్శి అనంతుల ప్రశాంత్

కొండపాక(గజ్వేల్): ప్రజల కోసం ఆలోచన చేసే సీఎం కేసీఆర్‌ను ఆశీర్వదించాలని జాగృతి రాష్ట్ర కార్యదర్శి అనంతుల ప్రశాంత్ కోరారు. మండల కేంద్రమైన కొండపాక, క్రాంతి నగర్, వడ్డెర కాలనీల్లో సోమవారం బీఆర్‌ఎస్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజల బాగోగుల విషయమై ఆలోచన చేస్తూ పథకాలను ప్రవేశ పెడుతున్నారన్నారు. పార్టీల కతీతంగా పేదలందరికీ పథకాలు అందేలా సీఎం చూసుకుంటున్నారని తెలిపారు. మూడో మారు అధికారంలోకి రాగానే సౌభాగ్యలక్ష్మి పథకం పేరిట మహిళలందరికీ నెల నెలా రూ. 3వేల జీవన భృతిని అందజేస్తారని వెల్లడించారు. ప్రతి యేడాదికీ వేయి చొప్పున వృద్ధాప్య, వితంతువు, ఆసరా పెన్షన్లకు పెంచే విధంగా కేసీఆర్ ముందుకు పోతున్నారని చెప్పారు. ప్రజల కోసం పని చేస్తున్న కేసీఆర్‌కు ఓటు ద్వారా ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొద్దుల కనకయ్య,నాయకులు బొద్దుల తిరుపతి, బైరోజి నర్సింహ్మాచారి, జంజరపు నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి,
జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
కె. లక్ష్మణ్
9502735264